క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వింజమూరు(ఉదయగిరి): నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన గణపం రమేష్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకాణిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నేతలు మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, అంకినపల్లి నారసింహారెడ్డి, సంజీవరెడ్డి, మద్దూరు బాలకృష్ణ, మద్దూరు చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు



ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే, ఫాతిమాబేగం జీవిత చరిత్రలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాయబ్‌రఫూల్, ఆవాజ్ కమిటీ నాయకులు నాయబ్‌రసూల్, సభ్యులు ఫరీద్‌బాషా, అన్వర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఆత్మకూరురూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధీర్ తెలిపారు. వాశిలి, నెల్లూరుపాళెం సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. వాశిలిలో 33, నెల్లూరుపాళెంలో 18 వినతులు రైతుల నుంచి అందాయని ఆయన తెలిపారు. డీటీ స్వరూప్, వాశిలి సర్పంచ్ చెలిక రమాహరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అన్నవరంలో పారిశుధ్య పనులు

జలదంకి: అన్నవరంలో సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులను సోమవారం చేపట్టారు. గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో వైద్యసిబ్బంది సూచనల మేరకు వీధుల్లోని చెత్త, ముగురును తొలగించి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం



వరికుంటపాడు: మండలంలోని మహ్మదాపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ. డీ శ్రీనివాస్,దుత్తలూరు సహాయ సంచాలకులు ఎస్ చంద్రశేఖర్, వరికుంటపాడు పశువైద్యాధికారి ఎస్‌వీ.రాఘవేంద్ర శర్మ ,సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టపైర్లకు సాగునీరు ఇవ్వాలని తీర్మానం

ఉదయగిరి: గండిపాళెం ప్రాజెక్ట్ ఆయకట్టుదారుల సమావేశాన్ని సాగునీటి సంఘం చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రాజెక్టులో 21 అడుగుల మేర నీరు ఉన్నందున పంట కాలువల్లోని కంపచెట్లు, పూడికతీయించి మెట్టపైర్లకు సాగునీరు ఇవ్వాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ప్రాజెక్ట్ పరిధిలో 16 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ మెట్టపైర్లకు సాగునీరందించే అవకాశం ఉందని ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. పూర్తిస్థాయిలో నీరు విడుదలకు రైతులు, కమిటీ ఆమోదం మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు టీడీపీ నాయకులు చెంచలబాబు, బయ్యన్న పాల్గొన్నారు.

జ్వరాలపై సర్వే

సోమశిల : అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, అనంతసాగరం, పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సోమవారం సర్వే చేపట్టారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

విద్యుత్ సిబ్బంది కొరత..అందని సేవలు

- ఆత్మకూరు డివిజన్ పరిధిలో 14 ఏఈ పోస్టులకు గానూ 12 ఖాళీ
- కాంట్రాక్ట్ డిప్లమో ఉద్యోగులపై ఆధారపడి సేవలు
- ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే అంతే
- కొరత పేరుతో నెలల తరబడి పట్టించుకోని వైనం
- కొత్త కనెక్షన్లకు దిక్కులేదు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు



ఆత్మకూరులోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం

ఆత్మకూరు: ఆత్మకూరు విద్యుత్ డివిజన్‌ను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. విద్యుత్ సేవలు అందించడంలో అసిస్టెంట్లు ఇంజనీర్లు కీలకం. అసిస్టెంట్ల ఇంజనీర్ల కొరతతో కాంట్రాక్ట్ డిప్లమో ఉద్యోగులపై ఆధారపడి సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా విద్యుత్ సేవలు సక్రమంగా అందక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే నెలల తరబడి పట్టించుకునే దిక్కులేక పంటలు ఎండిపోతూ రైతులు నష్టపోతున్నారు.

సిబ్బంది కొరత తీవ్రం

ఆత్మకూరు డివిజన్ పరిధిలో 14 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు ఉండాల్సి ఉండగా, 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ఇద్దరిలోనూ ఒకరు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విధులకు సక్రమంగా హాజరుకాలేకపోతున్నారు. దీంతో డిప్లమో అర్హతతో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సాంకేతిక ఉద్యోగులను ఎఫ్‌ఏసీపై ఏఈలుగా నియమించి సేవలు అందిస్తున్నారు. డివిజన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మెన్లు సైతం 39 మందికి గానూ 18 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. 21 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ లైన్‌మెన్లు 61 మంది ఉండాల్సి ఉండగా, 23 మంది మాత్రమే ఉన్నారు. దీంతో వారిపై పనిభారం పెరిగి ప్రజలకు సరైన సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. అలాగే జేఎల్‌ఎం గ్రేడ్-2 ఖాళీలు సైతం 5 ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్లు 28 మందికిగానూ 21 మంది మాత్రమే ఉన్నారు. అత్యవసర విభాగమైన విద్యుత్ శాఖలో ఖాళీలు భారీగా ఉండడంతో ప్రజలకు సరైన సేవలు అందకపోవడంతో పాటు ఉద్యోగులపైన పనిభారం అధికమైంది. వెంకటగిరి, నాయుడుపేట విద్యుత్ డివిజన్ల పరిధిలోని ఉద్యోగులు ఏళ్ల తరబడి బదిలీలు తప్పించుకుంటూ అక్కడే ఉండడంతో ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఖాళీలు భర్తీ కావడం లేదని ఆ శాఖ ఉద్యోగులే చెబుతుండడం గమనార్హం.

రూ.50కోట్ల బకాయిలు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. అసిస్టెంట్ ఇంజనీర్ల కొరతతో బకాయిల వసూళ్లపై దృష్టి సారించలేకపోతున్నారు. ఫలితంగా రూ.50.33కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. విద్యుత్ బిల్లుల ఎగవేతదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునేందుకు సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులే చెబుతుండడం విశేషం.

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే కష్టమే

ఆత్మకూరు విద్యుత్ డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే నెలల తరబడి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం 180కుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురై ఉన్నాయి. వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు గురైతే నెలల తరబడి మార్చకపోతుండడంతో రైతులు ఆరోపిస్తున్నారు. ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పంటలను కాపాడుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. డీఈఈకి వినతి పత్రం అందజేసినా చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు.

కొత్త కనెక్షన్లకు దిక్కులేదు

ఆత్మకూరు విద్యుత్ డివిజన్ పరిధిలో విద్యుత్ సిబ్బంది కొరతతో కొత్త కనెక్షన్ల మంజూరుకు దిక్కులేకుండా పోయింది. ఏడాది క్రితం చేజర్ల, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాలకు చెందిన 751 మంది రైతులకు కొత్త వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు రూ.6200 చొప్పున డిపాజిట్ కట్టించుకున్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో రైతుకు మూడు విద్యుత్ స్తంభాలు, తీగలు, నాలుగు వ్యవసాయ సర్వీసులకు కలిపి 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా స్పందన లేదు. రైతులు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేదు. జిల్లాకు విద్యుత్ మెటీరియల్ సరఫరా చేసే గూడూరు కేంద్రంలో (గోడౌన్) మెటీరియల్ లేనందున ఇవ్వలేకపోతున్నామని విద్యుత్ సిబ్బంది చెబుతూ తప్పించుకుంటుండడం గమనార్హం.

మెటీరియల్, సిబ్బంది కొరత వాస్తవమే



ఆత్మకూరు డివిజన్ పరిధిలో 13 మండలాలు ఉన్నాయి. ఏఈలు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. మెటీరియల్ సరఫరా చేసే గూడూరు స్టోర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవు. దీంతో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా ఇవ్వలేకపోతున్నాం. కొత్త కనెక్షన్లకు సంబంధించి రైతులు విద్యుత్ స్తంభాలు కొనుగోలు చేసి కండక్టర్లు (తీగ) ఏర్పాటు చేసుకుంటే బిల్లులు చెల్లిస్తాం.

– శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ డీఈఈ, ఆత్మకూరు డివిజన్

కొత్త కనెక్షన్లు వెంటనే ఇవ్వాలి



ఆత్మకూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కనెక్షన్లు ఇవ్వకపోవడంపై నెల రోజుల క్రితం ఆత్మకూరు డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశాం. త్వరలోనే ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. పరిస్థితి ఇలానే ఉంటే నెల్లూరులోని ఎస్ఈ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తాం.

–లక్కు ప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

రుణాల రికవరీపై దృష్టి సారించాలి



ఉదయగిరి: బ్యాంకు లింకేజీ రుణాల రికవరీపై వీఓఏలు ప్రత్యేక దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం ఖాజారహ్మతుల్లా సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వీఓఏలతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలోని 25 సంఘబంధాలు బ్యాంకు లింకేజీ రుణాలు పొందినట్లు తెలిపారు. కొన్ని సంఘాలకు చెందిన సభ్యులు రుణాల చెల్లింపుల్లో జాప్యం చేస్తుండడంతో రికవరీ శాతం తగ్గుతోందన్నారు. వీఓఏలు ప్రత్యేక దృష్టి సారించి పొదుపు సభ్యులకు అవగాహన కల్పించి రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మాల్యాద్రిగౌడ్

సంగం: మండంలోని సిద్దీపురం పంచాయతీ పరిధిలోని అనసూయనగర్‌కు చెందిన నెల్లూరు వెంకటశేషయ్య, వరలక్ష్మి దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఈ నేపథ్యంలో బాధిత చిన్నారులను పలువురు సోమవారం పరామర్శించి నగదు సాయం అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గ జై గౌడ అధ్యక్షుడు పీ మాల్యాద్రిగౌడ్ రూ.12వేలు నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే టీడీపీ మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, బాణా శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌యాదవ్ రూ.10వేలు నగదు అందజేశారు.

దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్



ఆత్మకూరురూరల్: నల్లపరెడ్డిపల్లిలో వెరిఫికేషన్ చేపడుతున్న అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలో దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్‌ను ప్రభుత్వం నియమించిన ప్రత్యేక వైద్యబృందం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి సోమవారం చేపట్టింది. అప్పారావుపాళెం, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, నువ్వూరుపాడు, దేపూరు, బండారుపల్లి, రామస్వామిపల్లి, నాగులపాడు, చెర్లోయడవల్లి, కరటంపాడు, బోయలచిరివెళ్ల, నబ్బీనగరం, వాశిలి, తదితర పంచాయతీల్లో పర్యటించి 23 మంది దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులను విచారించారు. తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు మురళీధర్, రమేష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి అభినందనలు



యాకూబ్‌ను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న ఎస్‌డీ యాకూబ్ అనే దివ్యాంగ విద్యార్థిని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సోమవారం అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ గత నెల 19న వెంకటాచలంలోని సీఆర్సీ సెంటర్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో పాల్గొన్న యాకూబ్ ప్రతిభకనబరిచాడని తెలిపారు. జూనియర్ విభాగంలో పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. దివ్యాంగులను చిన్నచూపు చూడరాదన్నారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం భవిత కేంద్రం రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాసాయిపేట మెయిన్, ఉర్దూ, దళితవాడ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల విద్య సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సూచనలు చేశారు. ఉపాధ్యాయులు షబ్బీర్, రామకృష్ణ, నరసింహా, ఐఆర్పీ శివనందిని, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీప క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను పట్టణంలోని మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్, పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ నాయకులు ఎస్ శ్రీలత, ఎస్ డానియేల్, సురేష్, ఆత్మకూరు సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఆంద్రా సుబ్బారెడ్డి, బాలఅంకయ్య, తోడేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో చోరీకి యత్నం

సోమశిల: సోమశిల ప్రాజెక్ట్ సమీపంలో కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఆలయ ముఖద్వారం గడిని ధ్వంసం చేసి దొంగలు లోనికి ప్రవేశించారు. అనంతరం గర్భగుడి తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించారు. తాళాలు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు కొండయ్యశర్మ ముఖద్వారం తాళాలను పగులగొట్టి ఉండడం గమనించి గ్రామస్తులకు సమాచారం అందజేశారు. గ్రామస్తులు వచ్చి పరిశీలించారు. గర్భగుడి తాళాలు తెరుచుకోక ఎటువంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో మూడు నెలల క్రితం కూడా దొంగలు చోరీకి పాల్పడగా పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు దొంగలను పట్టుకోకపోవడంతో మళ్లీ చోరీకి యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరిగిన ఘటన మీద కూడా సోమశిల ప్రాజెక్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు స్పందించి దొంగలను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం



బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని పట్టణంలోని ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బాలకృష్ణమ్మ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణమ్మ పోరాట ఫలితంగానే 010 పద్దు కింద నేడు ఉపాధ్యాయులు జీతాలు పొందుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం ఆయన జైలు జీవితం సైతం గడిపారని గుర్తు చేశారు. ఏపీటీఎఫ్ సీనియర్ బాధ్యులు, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామసుబ్బారెడ్డి, పెంచలయ్య, మల్లికార్జునరెడ్డి, శివకుమార్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శివరామ్, రత్నారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పదవిపై హర్షం



దుగ్గయ్య

సీతారామపురం : అయ్యవారిపల్లి సర్పంచ్ చింతనబోయిన దుర్గాప్రసాద్ యాదవ్(దుగ్గయ్య) వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత ఎన్నికల సమయంలో పార్టీకి దుగ్గయ్య అందించిన సేవలను గుర్తించి జిల్లాస్థాయి పదవి అప్పగించడంపై జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డిలతో పాటు పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుగ్గయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన వేలూరి



చేజర్ల: నెల్లూరులోని మేకపాటి నివాసంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చేజర్ల వైస్‌ఎంపీపీ వేలూరి తిరుపతినాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేకపాటిని శాలువాతో సత్కరించి తనకు పదవీ రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట యనమదల సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి ఉన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వం అందజేసే నైపుణ్య శిక్షణకు సర్వీసు ప్రొవైడర్ల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మెప్మా టీఎంఎంజీ మాధవి సోమవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, టీవీ, రిఫ్రిజరేటర్, వాషింగ్‌మెషిన్ మెకానిక్‌లు, బ్యూటీషియన్లు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఎన్‌ఎస్‌డీసీ, ఎస్‌డీసీ, ఎన్‌ఏసీల ద్వారా ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా మెరుగైన జీవనోపాధి లభించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అర్హులైన వారు ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు పాసుబుక్, విద్యార్హత సర్టిఫికెట్ జెరాక్స్, రెండు ఫొటోలతో మెప్మా కార్యాలయంలోని మెప్మా ఆఫీస్‌లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

మర్రిపాడు: మండలంలోని నాగినేనిగుంట అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆత్మకూరు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐతో పాటు ఆత్మకూరు, మర్రిపాడు ఎస్సైలు శ్రీనివాసరావు, జిలానీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఫ్లెక్సీలు తొలగించడం దుర్మార్గం



మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: 'పట్టణంలో క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే పదేళ్ల పాటు కావలి ఎమ్మెల్యేగా సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సైతం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు చెందిన ఫ్లెక్సీలు మాత్రమే తొలగించడం దుర్మార్గం' అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ఏర్పాటు చేసినవని తెలిసి కూడా ఫ్లెక్సీలు తొలగించడం దారుణమన్నారు. ఎవరి మెప్పు కోసం అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఫ్లెక్సీలు ప్రజలకు ఇబ్బందిగా ఉన్నాయని తమకు చెబితే తామే వాటిని తొలగించేవారమన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఫ్లెక్సీలను తొలిగించి, ఐరన్ ఫ్రేమ్‌లు కూడా కనిపించకుండా పడేసి దుష్ట సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం తగదన్నారు. తాను ప్రభుత్వ ఉద్యోగిని అనే విషయాన్ని కమిషనర్ గుర్తుపెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా రాబోయే రోజుల్లో సమన్యాయ వైఖరిని అవలంబించాలని కోరారు. టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు తమ నాయకుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి డ్రామాలాడడం హేయమైన చర్య అని ఖండించారు. మాజీ ప్రధాన మంత్రి మన్‌మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపైన టీడీపీ నాయకులు ఫ్లెక్సీ లు అంటించడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, మాజీ కౌన్సిలర్లు గుడ్లూరు మాల్యాద్రి, వేగూరు చిన్న పుల్లయ్య, కనుపర్తి రాజశేఖర్, పేరం వెంకటేశ్వర్లు, నాయకులు సైలాబ్, వీఎంఎస్‌ఆర్ మాలి, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఉదయగిరి: పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తాజా హుస్సేన్, కార్యదర్శి కరిముల్లా తెలిపారు. పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను సోమవారం వారు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో వీధుల్లోని చెత్త, ముగురును తొలగించి బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి) : ఉదయగిరి నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి పది శాతం ఎమ్మెల్యే నిధులను కేటాయిస్తామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వింజమూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో వీఎంసీఏ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరులో యువత కోసం ప్రత్యేకంగా క్రీడా మైదానాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఫిబ్రవరిలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జీ రఘునాథరెడ్డి, జూపల్లి రాజారావు, వనిపెంట సుబ్బారెడ్డి, గూడా నరసారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, ఎస్సై వీరప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

సీతారామపురం: సంజీవరెడ్డినగర్‌లో ఉపాధి నిధులు రూ.2.30 లక్షలతో ఈర్ల లక్ష్మీదేవి నిర్మించుకున్న గోకులం షెడ్డును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం ప్రారంభించారు. గోకులం షెడ్డులను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో తొలి విడతగా 47 కి.మీ మేర సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రెండో దశ సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రూ.1.40 కోట్లతో సంక్రాంతి నాటికి నియోజకవర్గంలోని రోడ్లపై గుంతలను పూడ్చే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ సుభాషిణి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడులోని రెండు బెల్టు దుకాణాలపై రాపూరు, పొదలకూరు ఎక్సైజ్ అధికారులు సోమవారం రాత్రి దాడులు జరిపారు. ఈ దాడుల్లో 60 మద్యం బాటిళ్లు, 20కిపైగా బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. బెల్టు దుకాణాల నిర్వాహకులు పోలూరు వెంకటమ్మ, షేక్ మస్తాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇద్దరు టీడీపీ మద్దతుదారులు కావడంతో బంధువులు స్థానిక టీడీపీ నాయకులను ఆశ్రయించగా ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఎక్సైజ్ అధికారులు టీడీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి చర్చలు జరపడం గమనించిన గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. ఈ విషయమై రాపూరు ఎక్సైజ్ అధికారులను సంప్రదించగా పూర్తి సమాచారం రాలేదని సమాధానం చెప్పడం గమనార్హం.

సీపీఎం రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ఉదయగిరి: నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. పట్టణంలో సీపీఎం నాయకులు రాష్ట్ర మహాసభల కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర మహాసభలకు కార్మిక, కర్షక, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఐ తనిఖీలు

సోమశిల: అనంతసాగరం, పాతదేవరాయపల్లిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థు వర్క్‌బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట హెచ్‌ఎంలు అల్తాఫ్, వలీఅహ్మద్, ఉపాధ్యాయులు ఉన్నారు.